ఫోటో తీయించారు. ఆ ఫోటో తీశాక మా తాతయ్య ఎక్కువరోజులు బతకలేదుట, ఆవిడకు అదంటే వొళ్లుమంట.

ఇంట్లో ఫోటో గ్రాఫరుంటే ఇంటికి దోషం అని చెప్పాను కదా – ఫిలిం ఖర్చేకాని బొమ్మదక్కే ఉపాయంలేదు. మా ఇంట్లో చాలా పిచ్చి ఫోటోలున్నాయి. అవన్నీ మావారు చేత్తో తీసినవే. పండగొస్తుంది. అప్పుడు కెమేరా పైకి తీస్తారు. మేం వెళ్ళి బట్టలు కట్టుకుని వచ్చి నిలబడ తాము క్లిక్కుమనిపిస్తారు. ఫిలిం కడిగివచ్చేదాకా ఆశగా ఎదురుచూస్తాం. ఆ బొమ్మలు చూశాక ఏడుపాగదు, బావులేదంటే తీసిన వారికి కోపం. ఆ బొమ్మలు సరిగా వున్నాయని సరిపెట్టుకుందామంటే ఆ ఫోటోలో వున్నంత వికారంగా వున్నామా అని మనసులో దిగులు. ఎగదీస్తే గో హత్య దిగదీస్తే ఫోటోగ్రాఫర్ హత్య. ఎందుకొచ్చిన గొడవ? స్టూడియోకి పోదాం పదండి అంటే మావారు వినరు. ఆయనకు కెమేరా వైరాగ్యం వస్తే అప్పుడు కాని మాకు మోక్షం లేదు. ఫిలిం పోకడేలేని ఫోటో బ్రతికేది కనపడదు.

# సామాన్య గృహ్యసూత్రాలు

ఏడ్చేవాళ్లని చూసి నవ్వుతాం. నవ్వేవాళ్ళని చూసి ఏడుస్తాం. ఏడుపు లేకుండా చేయటం అసాధ్యం. ఎందుకంటే ఒక పిల్లాడ్ని వూరుకోబెట్టేసరికి మరో పిల్లో పిల్లాడో ఏడుపుకి లంకించుకున్నట్లు లోకంలో దుఃఖం ఎక్కడో ఒకచోట ఎవరికో ఒకరికి కలుగుతూనే వుంటుంది కలక్కమానదు. ఒకచోట ఆగితే అది మరొకచోట పుడుతుంది. అది దాని స్వభావం. ఏడుపులాటిదే నవ్వు. ఎవరో ఒకరు నవ్వుతారు. నవ్విస్తారు. నవ్వుతూ వుంటారు ఏడవలేక. కాఫీ కషాయం పాలూ పంచదారతో కలిసి ఒక మిశ్రమ పానీయం తయారయినట్లు జీవితం సుఖ దుఃఖాల మిశ్రమ కషాయం కావాలి. పాలు తాగితే మంచిదే. అందరికీ పాలు దొరకవు కదా! అలాగే డికాక్షన్ మాత్రమే సేవించి సరిపుచ్చుకోవలసినట్లు వుంటాయి కొందరి జీవితాలు. ఈ సుఖ దుఃఖాలు కలగకపోతే మనం యీ లోకంలో జీవిస్తున్నట్లు దాఖలా లేమీ వుండవు.

ప్రేయసితో సంతోషంగా గడపాలనుకునే వాడు పెళ్ళాల్ని ఏడిపించక తప్పదు. త్రాగితే తప్పేముంది అనుకునేవారు త్రాగని వారికి న్యూసెన్స్ కలుగచేస్తారు. విమానంమీద వెళ్ళే వారి ఖర్చు భూమ్మీద వుండేవారు భరించవలసి వస్తుంది. ఒకరి సుఖం ఒకరి సంతోషం మరొకరికి దుఃఖం లేకుండా ఎప్పుడైనా వుందా? అంచేత నవ్వటానికి ధైర్యం కావాలి. నవ్వించే వారు చాలా కరేజియస్ పీపులయి వుంటారు. మూతి ముడుచుకు కూర్చునే వారిని నవ్వించటానికి ప్రయత్నించండి. ఎన్ని డాలర్లు ఖర్చవుతుందో మీకే తెలిసి వస్తుంది. వెచ్చగా

పడుకోవటం, కమ్మగా భోంచేయటం, సంతోషంగా వుండటం కోసం మనిషిఎన్నయినా పాట్లు పడతాడు. అవి లభించకపోతే మనిషికి దుఃఖం కలుగుతుంది కాని ఆ పాట్లను తల్చుకుంటే దానికి కల కారణాలను వెతికితే మనకు నవ్వు వస్తుంది. దుఃఖంలోంచి వచ్చిన నవ్వు బురదలోంచి పుట్టిన పువ్వు.

నవ్వితే కన్నీళ్ళొస్తాయికదా. కన్నీళ్లు ఉప్పగా వుంటాయి. ఉప్పు సముద్రంలో వుంటుంది. సముద్రంలాటి జీవితం నుండి రాలే కన్నీటి బొట్లు ఉప్పగా వుండటంలో ఆశ్చర్యం ఏముంది? చిదిమిన పాల్గారు చెక్కుటద్దములు అన్నారు మనవాళ్లు చిదిమితే పాలు కారడమేవిటో ఆ మిష్టరీ ఎంతకీ బోధపడకుండా ఉంది. చిదిమితే పాలుకారడం అనేది లేదు. కనుక అశాస్త్రీయం. పాలు కారినట్లు అనిపించవచ్చు. అది మనస్సుకి సంబంధించినది గనుక రమ్యమైనది. ఏదో జీవిస్తున్నాం అనుకుని వూరుకుంటే సరిపోదు. గోలచేస్తేనేకాని జీవిస్తున్నట్లు రుజువుకాదు. జీవిత మంటే గోల. అందుకే జీవితం గురించి ఎన్నో విషయాలు మాటల్లో బయటపడతాయి. నోరెందుకు పెట్టాడు దేవుడు? దాంట్లో మళ్ళీ నరంలేని నాలుక ఎందుకు? (కమాన్ టిల్ సందింగ్ ఎబవుట్ లైఫ్ - జీవితం గురించి ఏదో ఒకటి చెప్పు. చెప్పాలి తప్పదు) నోరు వున్నది. ఇడ్లెన్లు ఉప్మాలు నానారకాల పదార్థాలు బొక్కటానికి మాత్రమే కాదు. జీవితం గురించి నోరు తెరిచి మాట్లాడటానికి. ఏడ్చినపుడు ముక్కూ నోరూ కళ్ళూ అన్నీ ఏకమవుతాయి. గుండె బరువెక్కుతుంది. మెదడు వేడెక్కుతుంది. వీపు మీద గిల్లితే నోట్లోంచి అమ్మా అని ఎందుకు రావటం? అక్కడే వుంది విచిత్రం. మనుష్యుల్ని తినేసేట్లు చూస్తారు కొంతమంది. తినటమనేది గ్రహించటం అన్నమాట చేతుల్లో మనిషిని దగ్గరకు లాక్కుంటాం. చేతుల్తో యిష్టమైన వస్తువులన్నీ (తినేసి) నోట్లోకి తోస్తాం. చేతుల్తో అడ్డమైన వెధవ పన్లన్నీ చేస్తాం. చేతులు గ్రహించటానికే గాక యివ్వటానికి కూడా వున్నాయని మనం గ్రహించం. చాలా మందికి ఈ లోక మంతా తమ కోసం ముగ్గిన అరటిపళ్ళ గెలలా, పండిన పనస పండులా, పరువానికొచ్చిన పిల్లలా అనుభవించటాని కుందని అనుకుంటారు. లోకం తమకోసమనుకునే వారికంటె తాము లోకం కోసం అని జీవించే వారి సంఖ్య తగ్గటం వలన ప్రమాదాలు హెచ్చుగా జరుగుతున్నాయి.

లోకంలో సంతోషాన్ని ప్రసారం చేయటానికి ఒకే ముఖ్యసూత్రం వుంది. అది యివ్వగలగటం ఏదైనాసరే ఆఖరికి చిరునవ్వైనా సరే యివ్వగలగాలి. సహాయం చేయటం కోసమే చేతులున్నాయి అని మనం జ్ఞాపకం వుంచుకోవాలి. ఎవరికైనా సరే తోడ్పడే అవకాశం వస్తే పప్పులో గరిటలా జారిపోకూడదు. చాలా తొందర పనులున్నాయి తరువాత కలుద్దామని నంగిమాటలు చెప్పకూడదు. అవకాశం దొరికితే సహాయం చేసి తీరాలి. ఎవరికైనా ఏ సందర్భంలోనైనా సరే, సహాయం చేయటం వలన మన ఉనికి సార్థకమవుతుంది. ట్వంటీఫోరవర్సూ తన బాగు కోసమే జీవించే డబ్బు నేతగాళ్లు (మనీస్పిన్నర్స్) వలన లోకంలో దుఃఖం పెరిగిపోతోంది. మంచికి కీడూ చెడుకి సహాయం చేయకూడదు గదా? నేను మా వారితో అంటుంటాను

"మనం మనుషులమని రుజువు చేసుకోడానికి వచ్చే అవకాశాల్ని జారవిడువకండీ" అని. ఇపుడు మనం కాదంటావా అన్నట్లు అయోమయంగా చూస్తారు. అవసరానికి కూర్చున్న చోట నుంచి లేవలేని వాళ్ళు మనుష్యు లెట్లాగవుతారు? తల్లికి గర్భధారణ ప్రసూతి బాధల్ని కలిగించిన వారేతప్ప వారు మనుష్యు లెట్లాగవుతారు! కారెంత మాత్రం కారు.

అంచేత రోజూ ఒక మంచిపని చేయాలని మేంప్లాను వేసుకున్నాం. మా వీధిలో ఒక కుర్రాడు లాంతరు స్తంభం దగ్గర నిలబడి ఏడుస్తుంటే మా వారు వాడ్ని పోలీసు స్టేషనులో వప్పగించి వచ్చారు. వాళ్ళ యింటి గుమ్మం దగ్గర నిలబడిన కుర్రాడ్ని రిక్షాలో వేయించుకొని వాడికి బిస్కట్లు, మిఠాయిలు కొనిపెట్టి స్టేషన్‌లో దిగబెట్టడానికి మావారికి నాల్రూపాయలైంది. పోలీసువాళ్ళు ఆ పిల్లవాడి తాలూకువాళ్ళు మావార్ని తలవాచేలా చివాట్లు పెట్టారు. నీ కిదేం పోయేకాలమని. ఆ మర్నాడు మావారు ఒక పంపు దగ్గర నీళ్ళబిందె ఎత్తుకోలేక అవస్థ పడుతున్న అమ్మాయికి సాయం చేయబోయారు. ఆ అమ్మాయి బిందెడు నీళ్ళూ మా వారిమీద వంపేసి పరిగెత్తుకుని యింట్లోకి పారిపోయి తనరెండో పెళ్ళి మొగుడ్ని వీధిలోకి తీసుకొచ్చింది. వాడికి అయిదురూపాయలిచ్చి వూరుకో బెట్టాల్సి వచ్చింది. నేను మా పక్కవాటా వారు దండెం మీద ఆరేసుకున్న రవిక క్రిందపడితే వారి కిద్దామని తీస్తుండగా ఆ ఇల్లాలు రయ్ రయ్ మంటూ వచ్చి ఇదివరకు రెండు జాకెట్లు యిల్లాగే పోయాయి అని అవి కూడా తెమ్మని నామీద దాడి కొచ్చింది. మా పొరుగింటి బామ్మగారికి కళ్లు కనపడవు. ఆవిడ నూతి పళ్ళెంమీద జారిపడబోతుంటే పట్టుకుంటే మడి చెడగొట్టానని మళ్ళీ స్నానంచేసి నన్ను తిట్టింది. మా పేటలో ఆస్పత్రిలో పేషంట్లకు పూలిద్దామని ఒకరోజు మేము పూలగుత్తులు కొనుక్కుని ఆస్పత్రి కెళ్ళితే నన్నూ మావారినీ చివాట్లు పెట్టింది. ఆస్పత్రిలోకి దొంగలు యిలాగేవచ్చి పేషంట్ల తాలూకు సామాన్లను అపహరిస్తున్నారంటూ. పోస్టాఫీసు దగ్గర మావారు ఉత్తరాలు మనియార్డర్లు రాసి పెట్టి ఒక్క పార్కరుపెన్ను పోగొట్టుకున్నారు. రిక్షాలోంచి దిగలేక అవస్థపడుతున్న ఒక నిండుగర్భిణికి చేయూత నివ్వబోయి మావారు రోడ్డుమీద అలా చేయూత నివ్వని పెద్ద మనుషుల చేత చివాట్లు తిన్నారు. మా పక్కవీధిలో ఒకాయనకు రోగం వచ్చి తిరగబెట్టి యిప్పుడు తగ్గి కోలుకుంటున్నారని తెలిసి ఆయనకు ఏమైనా కథలుచదివి వినిపిద్దామని మేమిద్దరమూ వెళ్ళాం. ఆ ఇంటావిడ యిలాటివాళ్ళు చాలా మంది వస్తున్నారు. ఇప్పుడు చెయ్యూరుకోలేదు పొమ్మంది, మేం నిర్ఘాంత పోయాం.

రోజుకో మంచి పనిచేయటానికి మేం ఎంత ప్రయత్నించినా విఘ్నేశ్వరుడి పెళ్ళికి వేయి విఘ్నాలులాగా మేము ఏ మంచిపనీ చేయలేక పోతున్నాం. రోజుకో మంచిపని చేయండి అన్న వాడెవడో కార్టూన్లు గీసే వాడయి వుంటాడు. అవును భగవంతుడుమట్టుకు గొప్ప కార్టూనిస్టు ఎందుకు కాకూడదు? మనమంతా భగవంతుడి కార్టూన్లం.